## శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఫలం

అన్ని రకాల పంటలు బాగా పండుతాయి. పాలకులు, ప్రజలు పరస్పర స్నేహం కలిగి ఉంటారు. ప్రజాభీష్ట పరిపాలన ఉంటుంది. చైత్రం, వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో ధాన్యాదుల ధరలు అధికంగా ఉంటాయి. రాజకీయాలు ఒడుదొడుకులకు గురవుతాయి. కొన్నిచోట్ల ఉత్పాత భయాలు నెలకొంటాయి. ఆషాఢంలో స్వల్పవృష్టి ఉంటుంది. ఉభయ శ్రావణాల్లో (అధిక, నిజ మాసాలు) వర్షాలు పుష్కలంగా కురుస్తాయి. భాద్రపదంలో అతివృష్టి, వరదలు ఉంటాయి. ఆశ్వయుజంలో ఆహార ధాన్యాల ధరలు తగ్గుతాయి. కార్తికం, మార్గశిరం, పుష్యం, మాఘం, ఫాల్గుణ మాసాల్లో దేశ రాజకీయాల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ధాన్యం ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. ప్రజల్లో కలహాలు చెలరేగుతాయి. స్వల్పకాలంలోనే సద్దుమణుగుతాయి.

### గురు సంచారం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం వైశాఖ శుద్ధ పాడ్యమి తేది 21-4-2023 శుక్రవారం తెల్లవారితే శనివారం అనగా రా.తె. 5-09 గంటలకు గురువు మేషరాశిలోకి ప్రవేశిస్తున్నాడు. ఉగాది మొదలుకొని వైశాఖ శుద్ధ పాడ్యమి వరకు మీనరాశిలో గురువు సంచారం వల్ల నాయకులకు, ప్రజలకు అన్యోన్యత ఏర్పడుతుంది. పాలకులు ధర్మ బద్ధంగా వ్యవహరిస్తారు. సంక్షేమ పథకాలను సంపూర్ణంగా అమలుచేస్తారు. ఏప్రిల్ 22 నుంచి సంవత్సరాంతం వరకు గురువు మేషంలోనే సంచరిస్తాడు. పంటలు సమృద్ధిగా పండుతాయి. ప్రజారోగ్యం మెరుగుపడుతుంది. పంటలకు అనుకూలమైన వర్షాలు కురుస్తాయి. పాలకులకు మిశ్రమ ఫలితాలు ఉంటాయి. విదేశాల్లో ఈతి బాధలు అధికమవుతాయి.

### శని సంచారం

గతేడాది అంటే శుభకృత్ నామ సంవత్సరం పుష్య కృష్ణ దశమి మంగళవారం తేది 17-1-2023 శనైశ్చరుడు కుంభరాశిలోకి ప్రవేశించాడు. తదాది శోభకృత్ సంవత్సరం మొత్తం శని అదే రాశిలో సంచరిస్తాడు. ఫలితంగా వర్షాభావ పరిస్థితులు తలెత్తుతాయి. పాలకుల మధ్య వైషమ్యాలు పొడచూపుతాయి. విదేశాల్లో యుద్ధ వాతావరణం ఏర్పడుతుంది. పంటలకు చీడపీడల బాధ అధికమవుతుంది.

### రాహు కేతువుల సంచారం

సంవత్సరం ఆరంభం నుంచి 30-10-2023 వరకు రాహువు మేషంలో, కేతువు తులారాశిలో సంచరిస్తారు. ఆశ్వయుజ కృష్ణ విదియ తేది 30-10-2023 సోమవారం సాయంత్రం 4-35 గంటలకు రాహువు మీనంలోకి, కేతువు కన్యా రాశిలోకి ప్రవేశిస్తారు. తదాది సంవత్సరాంతం వరకు ఆ రాశుల్లోనే సంచరిస్తారు.

### కర్తరీలు

సూర్యుడు అగ్ని నక్షత్రమైన కృత్తికపై సంచరించే కాలాన్ని వాస్తు కర్తరీ అని పిలుస్తారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం వైశాఖ శుక్ల చతుర్దశి తేది 4-5-2023 గురువారం తెల్లవారితే శుక్రవారం అనగా రా.తె. 3-28 గంటల నుంచి జ్యేష్ఠ శుక్ల నవమి సోమవారం తేది 29-5-2023 ఉదయం 8-16 వరకు వాస్తు కర్తరీలు ఉన్నాయి.

**ఇవి చేయవచ్చు:** గృహప్రవేశం, ఉపనయనం, వివాహం, యజ్ఞయాగాదులు చేసుకోవచ్చు.

**ఇవి చేయకూడదు:** గృహారంభం, నూతన వస్త్రధారణ, విత్తన నాట్లు, కేశ ఖండనం, కొత్త వాహనం కొనడం, దేవాలయ ఆరంభం, బావి తవ్వడం, గడ్డికోత పనికిరావు.

### గురు మూఢం

శ్రీ శోభకృత్ నామ సంవత్సర చైత్ర శుక్ల షష్ఠి తేది 27-3-2023 సోమవారం తెల్లవారితే మంగళవారం రా.తె. 5-47 గంటలకు గురు మూఢం మొదలవుతుంది. వైశాఖ శుక్ల షష్ఠి తేది 26-4-2023 బుధవారం తెల్లవారితే గురువారం రా.తె. 5-05 గంటల వరకు గురు మూఢం ఉన్నది.

### శుక్ర మూఢం

శ్రీ శోభకృత్ నామ సంవత్సర అధిక శ్రావణ కృష్ణ పంచమి తేది 6-8-2023 ఆదివారం తెల్లవారితే సోమవారం రా.తె. 4-36 నుంచి నిజ శ్రావణం శుక్ల తదియ తేది 19-8-2023 శనివారం తెల్లవారితే ఆదివారం రా.తె. 4-27 గంటల వరకు శుక్ర మూఢం ఉంది.

- **మూఢంలో వివాహం, ఉపనయనం, గృహప్రవేశం, గృహారంభం, దేవతా ప్రతిష్ఠ, తీర్థయాత్రలు, పుట్టు వెంట్రుకలు, యజ్ఞాలు చేయరాదు.**
- **జన్మ నక్షత్ర శాంతులు, గ్రహ శాంతులు చేసుకోవచ్చు.**

### రవి సంచారం

**రోహిణి కార్తె:** శ్రీ శోభకృత్ నామ సంవత్సరం జ్యేష్ఠ శుక్ల షష్ఠి గురువారం తేది 25-5-2023 రాత్రి 8-58 గంటలకు ఆశ్లేష నక్షత్రం ప్రథమ పాదం, కర్కాటక ప్రయుక్త కన్యా లగ్నంలో రోహిణి కార్తె ప్రవేశం.

**ఫలం:** పురుష-స్త్రీ యోగం: సువృష్టి, సూర్య-చంద్ర యోగం: మంచి వర్షాలు కురుస్తాయి. కన్యాలగ్నం: అనావృష్టి. అమృతనాడి: అననుకూల వర్షాలు.

**మృగశిర కార్తె:** శ్రీ శోభకృత్ నామ సంవత్సరం జ్యేష్ఠ కృష్ణ పంచమి గురువారం తేది 8-6-2023 సాయంత్రం 6-53 గంటలకు శ్రవణం నక్షత్రం, నాలుగో పాదం.. మకర రాశి ప్రయుక్త వృశ్చిక లగ్నంలో మృగశిర కార్తె ప్రవేశం.

**ఫలం:** పురుష-పురుష యోగం: స్వల్ప వృష్టి. చంద్ర-చంద్ర యోగం: సామాన్య వర్షం. వృశ్చిక లగ్నం: మోస్తరు వర్షాలు. వాయునాడి: వాయువుతో కూడిన వర్షపాతం.

**ఆరుద్ర కార్తె:** శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఆషాఢ శుక్ల చవితి గురువారం తేది 22-6-2023 సాయంత్రం 5-48 గంటలకు ఆశ్లేష నక్షత్రం, మూడోపాదం కర్కాటక రాశి ప్రయుక్త వృశ్చిక లగ్నంలో ఆరుద్ర కార్తె ప్రవేశం.

**ఫలం:** స్త్రీ-స్త్రీ యోగం: స్వల్ప వృష్టి, చంద్ర-చంద్ర యోగం: మోస్తరు వానలు. వృశ్చిక లగ్నం: సామాన్య వృష్టి. ప్రవేశ సమయ తిథి పంచమి: శుభప్రదం. గురువారం: సుభిక్షం. వృశ్చిక లగ్నం: ఇరుగు పొరుగు దేశాలతో యుద్ధ వాతావరణం. హర్షణ నామయోగం: శుభసూచన. సాయంత్రం ప్రవేశం: అనుకూల వర్షాలు. బవ కరణం: సుఖప్రదం.